జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

ఆదివారం | 20-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 800 పేజీలు: 4 వెల: రూ.7

స్థానిక సమరానికి..

సిద్ధం కండి

స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా

- కార్యకర్తలే సమన్వయకర్తలు
- ఐక్యంగా ముందుకు సాగండి
- ప్రజాభిమానమే ప్రామాణికం..
- కేడర్ కదలాలి
- గెలుపే లక్ష్యంగా సాగాలి
- కార్యకర్తలకు ధర్మాన బ్రదర్స్ పిలుపు
- పలాసలో విస్తృతస్థాయి సమావేశం
- శ్రేణులకు నేతల దిశా నిర్దేశం

పలాస, సెప్టెంబరు 19 (వార్త): స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సన్నద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, డాక్టర్ సీదిరి అప్పలరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. పలాసలో శనివారం డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు.

స్థానిక ఎన్నికల్లో ప్రజాభిమానం ఉన్న నాయకులను అభ్యర్థులుగా ఎంపిక చేయాలని సూచించారు. ఒకే పదవికి పలువురు ఆశావహులు ఉన్నా పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఏకాభిప్రాయంతో అభ్యర్థిని ఎంపిక చేయాలని, ఎంపికైన అభ్యర్థి విజయానికి అందరూ కలిసి పనిచేయాలని కోరారు. గ్రామ స్థాయి నుంచే పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంచుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యలను నిరంతరం అధ్యయనం చేసి వాటిపై పోరాడాలని ధర్మాన ప్రసాదరావు అన్నారు. రైతులకు ఎరువుల లభ్యత, పంటలకు గిట్టుబాటు ధరలు, విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర ధరల పెరుగుదల, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు వాస్తవాలను వివరించాలని తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ కార్యకర్తలు పార్టీ కోసం పనిచేస్తున్నారని డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బు, వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజాభిమానం, అందుబాటులో ఉండే నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ప్రజల కోసం..
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ
మన పల్లెల కోసం.. మన ప్రజల కోసం..
స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ఉందని తమ్మినేని సీతారాం అన్నారు. పెరుగుతున్న ధరలతో సామాన్యులపై ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించాలని సూచించారు.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు మూడు మండలాల్లో పార్టీని బలోపేతం చేయాలని ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ తదితర స్థానాల్లో సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేసి వారి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు హనుమంతు వెంకట్రావు, సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, ధనంజయ్, పైల వెంకటరమణ (చిట్టి), శిష్టు గోపి, దువ్వాడ రవి, ఉంగ సాయి కృష్ణ, పుక్కళ్ల గురయ్యనాయుడు, పాలిన శ్రీనివాస్, మొదలవలస మన్మథరావు, పి.వెంకటరావు, డొక్కరి దానయ్య, పాలిన శ్రావణి శ్రీనివాస్, సొర్ర డిల్లేశ్వరరావు, బత్తిన హేమేశ్వరరావు, బోర కృష్ణారావు, దువ్వాడ మధుకేశ్వరరావు, అగ్గున సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

జమ్ము జంక్షన్ వద్ద ..

ప్రైవేట్ బస్సు దగ్ధం

- టైరు పేలడంతో మంటలు చెలరేగినట్లు నిర్ధారణ
- సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు
- తప్పిన ప్రాణనష్టం
- మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



నరసన్నపేట, సెప్టెంబరు 19 (వార్త): జమ్ము జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో శనివారం ఉదయం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటన కలకలం రేపింది. విజయవాడ నుంచి టెక్కలి వెళ్తున్న బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి కొద్దిసేపటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో బస్సులో పది మందికి లోపే ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది. మంటలు చెలరేగిన వెంటనే అప్రమత్తమైన ప్రయాణికులు బస్సు నుంచి కిందకు దిగడంతో ఎలాంటి ప్రాణనష్టం, గాయాలు సంభవించలేదు. ప్రాథమికంగా బస్సు టైరు పేలడంతో మంటలు చెలరేగినట్లు అధికారులు గుర్తించారు. బెర్త్ సీట్లు ఎక్కువగా ఉండటంతో మంటలు బస్సులో వేగంగా వ్యాపించినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సిబ్బందితో కలిసి తీవ్రంగా శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే మంటలు బస్సు మొత్తం వ్యాపించడంతో వాహనం పూర్తిగా కాలిపోయింది. ఘటన సమాచారం అందుకున్న ఎస్సై బి.గణేశ్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. అనంతరం సీఐ ఎం. శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. టైరు పేలడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని, అయితే బస్సు డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు. అగ్నిమాపక అధికారులు వరహాలు, దుర్గారావు మాట్లాడుతూ సమాచారం అందిన వెంటనే సిబ్బందితో కలిసి మంటలను అదుపు చేశామని పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన ఇతర కారణాలు, నష్టంపై మరింత సమాచారం అధికారుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఆర్‌ఎంపీ ఇంట్లో తనిఖీలు

- జగన్నాథపురంలో ఔషధ నియంత్రణ అధికారుల దాడి
- అనుమతులు లేని రూ.లక్షకు పైగా విలువైన మందులు స్వాధీనం
- కేసు నమోదు

నరసన్నపేట, సెప్టెంబరు 19 (వార్త): జగన్నాథపురం ప్రాంతంలోని ఆర్‌ఎంపీ వైద్యుడు గొందు స్వామిబాబు ఇంట్లో జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు శుక్రవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఔషధ నియంత్రణ సహాయక అధికారి ఎం.చంద్రరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో అనుమతులు, సంబంధిత ఆధారాలు లేని మందులను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల సందర్భంగా సుమారు రూ.లక్షకు పైగా విలువైన మందులు లభించినట్లు పేర్కొన్నారు. మందుల నిల్వ, వినియోగానికి సంబంధించి అవసరమైన అనుమతులు, ఆధారాలను పరిశీలించిన అధికారులు వాటికి సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో మందులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఔషధాల విక్రయాలు, నిల్వలు, వినియోగం విషయంలో నిబంధనలు పాటించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో అనుమతులు లేకుండా మందులను నిల్వ చేయడం లేదా వినియోగించడం వంటి చర్యలపై శాఖాపరంగా పరిశీలన చేపడు తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు కొనసా గిస్తున్నట్లు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రరావు వెల్లడించారు. తనిఖీల్లో గుర్తించిన మందుల వివరాలు, వాటికి సంబంధించిన అనుమతులు, ఇతర అంశాలపై విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

మేనమామ ఇంటికే ..

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు రూ.32.50 లక్షల సొత్తు స్వాధీనం
- 17 తులాల బంగారం, 1,640 గ్రాముల వెండి, రూ.4 లక్షలు రికవరీ

కన్నం వేసిన మేనల్లుడు

పలాస, సెప్టెంబరు 19 (వార్త): సొంత మేనమామ ఇంటికే కన్నం వేసిన మేనల్లుడితోపాటు మరో ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను కాశీబుగ్గ సబ్‌డివిజన్ పోలీసులు అరెస్టు చేశారు. వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, పాతపట్నం పోలీసుస్టేషన్ల పరిధిలో జరిగిన నాలుగు చోరీ కేసులను ఛేదించి నిందితుల నుంచి రూ. 32.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు శుక్రవారం వెల్లడించారు.

సాంకేతిక ఆధారాలతో పట్టివేత

వజ్రపుకొత్తూరు మండలం ఎన్‌హెచ్-16 వెంకటాపురం బ్రిడ్జి సమీపంలోని సర్వీసు రోడ్డులో శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాంకేతిక ఆధారాలతో వారు మోటార్‌సైకిల్‌పై వస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడ కాపుకాశారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా నాలుగు చోరీ కేసుల గుట్టు రట్టయింది.

ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాకిమిడి కంద్రవీధికి చెందిన బెనియా దుర్గాప్రసాద్ (28), దేబా మండల్ (35), టీటా మండల్ ప్రాంతానికి చెందిన పొట్నూరు మిన్నారావు (25)లను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. వీరు నాలుగు ప్రాంతాల్లో చోరీలు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైందని శ్రీనివాసరావు తెలిపారు. నిందితులు వజ్రపుకొత్తూరు పోలీసుస్టేషన్ పరిధిలోని పాతటెక్కలి, మెళియాపుట్టి పరిధిలోని పద్మాపురం, పాతపట్నంలోని మొండిగల్ల వీధి, శివ శంకర్ కాలనీల్లో చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని ఆయన తెలిపారు. రాత్రివేళల్లో ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గతంలోనూ పర్లాకిమిడిలో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లినట్లు వెల్లడైంది. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ముగ్గురూ కలిసి మళ్లీ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వ్యసనాల కోసమే చోరీలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. నిందితులు తాపీ, పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నప్పటికీ, వాటి ద్వారా వచ్చే ఆదాయం తమ చెడు వ్యసనాలకు సరిపోకపోవడంతో దొంగతనాల బాట పట్టినట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు కేసుల్లో మొత్తం 27 తులాల బంగారు ఆభరణాలు, 1,640 గ్రాముల వెండి వస్తువులు, రూ.4.30 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఇప్పటివరకు 17 తులాల బంగారం, 1,640 గ్రాముల వెండి, రూ.4 లక్షలను రికవరీ చేశారు. 10 తులాల బంగారు ఆభరణాలను పర్లాకిమిడిలోని వివిధ బ్యాంకుల్లో తాకట్టు పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. వాటిని కూడా త్వరలో రికవరీ చేస్తామని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాలను కోర్టు అనుమతితో బాధితులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు.

కేసుల దర్యాప్తులో చురుగ్గా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీసు అధికారులు అభినందించారు. వారికి ప్రోత్సాహక నగదుతోపాటు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కేసుల దర్యాప్తును కాశీబుగ్గ డీఎస్పీ టి.భవానీ పర్యవేక్షించారు. ఈ సమావేశంలో కాశీబుగ్గ సీఐ జి.రామకృష్ణ, కాశీబుగ్గ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎం.తిరు పతి, క్రైమ్ టీమ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, ఎస్ఐలు భారత్, దుర్గా ప్రసాద్, కె.మధుసూదనరావు, క్రైమ్ టీమ్ హెచ్‌సీ శ్రీను, పీసీలు మాధవ, హరీష్, అలీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

నేడు కిల్లోయిలో వినాయకునికి కుంకుమ పూజలు

మందస, సెప్టెంబరు 19(వార్త): మందస మండలంలోని కిల్లోయి గ్రామంలో ఈ నెల 20న వినాయక చవితి సందర్బంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు శ్రీకిల్లమ్మతల్లి యూత్ అసోసియేషన్ నాయకులు చెప్పారు. కిల్లోయి యూత్ ఆధ్వర్యంలో ఉదయం 10గంటలకు కుంకుమ పూజలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నదాన కార్యక్రమం, 6గంటలకు భజన, కార్యక్రమం జరుగుతుందని నాగేశ్వర జయరాం తెలిపారు. శ్రీసిద్ధి వినాయకస్వామి చవితి సందర్బంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, కార్యక్రమాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

మందస, సెప్టెంబరు 19(వార్త): మందస మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మనంత్ర సంస్థ ఫౌండర్, యువ సైకాలిజిస్ట్ జీరు మనీషా ఆధ్వర్యంలో ప్రస్తుత సమాజంలో విద్యార్థులు మానసికంగా ఎలా అభివృద్ధి చెందాలి.. భవిష్యత్ సవాళ్ళను ఏవిధంగా ఎదుర్కొనాలి.. మానసిక దృఢత్వం కలిగి ఉండటం వలన కలిగే లాభాలపై పవర్ పాయింట్ ప్రెజింటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఆంధ్రా యూనివర్సిటీ నుండి సైకాలజీ విభాగంలో ఎమ్మెస్సీ చదివిన ఆమె ఇటీవల కాలంలో అంతర్జాతీయ ఉత్తమ యువ సైకాలజిస్ట్ గా ఎంపికయ్యారు. మనీషా సతీష్ మెమోరియల్ ఫౌండేషన్ సహకారంతో ఇటువంటి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తూ, విద్యార్థుల మానసిక అభివృద్ధిలో తోడ్పాటును అందిచడం గొప్ప విషయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎం.చిత్రసేను, జి.చిన్నికృష్ణ, ఎం.దామోదరం, పి.అఖిల, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు పీఎం స్వనిధి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 19 (వార్త): ఇచ్ఛాపురం మున్సిపల్ సమావేశం మందిరం లో మున్సిపల్ కమీషనర్ రమేష్ అధ్యక్షతన మెప్మా ఆధ్వరం లో పి ఎం స్వనిది లోక్ కల్యాణ మేళా నిర్వహించారు .ఈ సమావేశం లో కమీషనర్ మాట్లాడుతూ అర్హత గల వీధి విక్రయ దారులు అందరకు సకాలం లో రుణాలు, క్రెడిట్ కార్డు లు అందజేయాలనీ బ్యాంకు మేనేజర్ లు అందరకు చెప్పారు .అలాగే రుణాలు చెల్లింపులు ప్రతి నెల జరిగేలా మెప్మా సిబ్బంది అర్ పి లు తగు చర్యలు తీసుకోవాలని తెలియజేసారు.ఈ కార్యక్రమం లో మెప్మా విభాగం టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ బోర భాస్కరరావు, సి వో లు సంతోష్, బాలరాజు, శ్రీను, బ్యాంకు మేనేజర్లు అనిత పండా, సత్యనారాయణ, సంతోష్,ప్రియంబాత్ రాథో తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే లక్ష్యంగా స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర

- ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రతా కార్యక్రమాలు

- వేతనదారులతో కార్యక్రమానికి శ్రీకారం

- ప్రతి గ్రామంలో చేపట్టాలని ఆదేశాలు

సారవకోట, సెప్టెంబరు 19 (వార్త): స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సారవకోట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో శనివారం పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధి హామీ వేతనదారుల భాగస్వామ్యంతో చేపట్టినట్లు ఎంపీడీవో మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు నిరంతరం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛమైన పరిసరాలతోనే ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పరిశుభ్రతను ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టాలని ఇప్పటికే సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో రహదారులు, కాలువలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పరిశుభ్రమైన గ్రామాల సాధనే లక్ష్యంగా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ వేతనదారులు, సిబ్బంది తదితరులు పాల్గొని కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. గ్రామస్థాయిలోనూ ఇదే స్ఫూర్తితో పరిశుభ్రత కార్యక్రమాలను కొనసాగించాలని అధికారులు కోరారు.

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

దళితులపై చిన్న చూపేల?

- ఆ సామాజిక వర్గానికి దక్కని మండల అధికార పదవులు

-దశాబ్దాలుగా తప్పని ఎదురు చూపు

- రిజర్వేషన్లపై పాలకుల నిర్లక్ష్యం

- ఆశావహుల్లో రిటైర్డ్ ఎంఈఓ గువ్వాడ లక్ష్మీనారాయణ

మందస, సెప్టెంబరు 19(వార్త): దశాబ్దాలుగా మందస మండలంలో దళిత సామాజిక వర్గానికి అన్యాయమే జరుగుతోందని ఆ సామాజిక నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు దళితులకు ఎంపీపీ, జడ్పీటీసీ పదవులకు రిజర్వేషన్లు ఏ రాజకీయ పార్టీలు గాని ఏ ప్రభుత్వాలు గాని దళిత సామాజిక వర్గానికి కేటాయించలేదని వారు ఆరోపిస్తున్నారు. ఈసారైనా కూటమి ప్రభుత్వం దళితులను గుర్తించాలని మందస మండల విశ్రాంత విద్యాశాఖాధికారి గువ్వాడ లక్ష్మీనారాయణ కోరారు. లక్ష్మీనారాయణ భార్య విజయ గతంలో మందస మండలంలోని సొండిపూడి సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహించారు. లక్ష్మీనారాయణ, విజయ దంపతుల కుమారుడు గువ్వాడ క్రాంతికుమార్ శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్.సి. సెల్ కార్యదర్శిగా చేస్తున్నారు. మై టీడీపీ యాప్ లో నియోజకవర్గం స్థాయి లో కూడా క్రాంతికుమార్ చురుకుగా పనిచేస్తున్నారు. గువ్వాడ లక్ష్మీనారాయణ కుటుంబం గౌతు కుటుంబ మూడు తరాలు కోసం పనిచేస్తున్నారు. దళిత సామాజిక వర్గానికి ఎంపీపీ గానీ జడ్పీటీసీ గానీ రిజర్వేషన్లు కేటాయిస్తే గువ్వాడ లక్ష్మీనారాయణ పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన అభిమానులు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉన్న కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని దళితులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పాతపట్నం, సెప్టెంబరు 19 (వార్త): పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని దువ్వారి వీధిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రతతోనే చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రజలందరి బాధ్యతని, అందరూ బాధ్యతగా స్వర్ణాంధ్ర సచ్ఛాంధ్ర నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. "స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్" నినాదంతో జరుగుతున్న ఈ ఉద్యమం మన పరిసరాలు శుభ్రంగా ఉంచడంతో ప్రతి ఒక్కరిని ప్రేరేపిస్తుందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పేపర్ బ్యాగులను వాడాలని ఆయన సూచించారు. అనంతరం తెదెపా శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే గోవిందరావు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో చెత్తను శుభ్రం చేసి, పరిసరాల పరిశుభ్రతపై అధికారులు, విద్యార్థులు, స్థానిక నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

క్లస్టర్ కాంప్లెక్స్‌లను సద్వినియోగం చేసుకోవాలి

జలుమూరు, సెప్టెంబరు 19 (వార్త): విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న క్లస్టర్ కాంప్లెక్స్ కార్యక్రమాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు బమ్మిడి మాధవరావు, ఎం.వి.ఆర్.ఎస్. ప్రసాదరావు సూచించారు. శనివారం జలుమూరు, చల్లవానిపేట జడ్పీ పాఠశాలలతో పాటు పరిధిలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న క్లస్టర్ కాంప్లెక్స్ కార్యక్రమాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను మెరుగుపరిచే ఉద్దేశంతో క్లస్టర్ కాంప్లెక్స్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సబ్జెక్టుల వారీగా శిక్షణా కార్యక్రమాలను చేపడుతున్నామని, ఆయా విషయాల్లోని బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచే విధానాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. క్లస్టర్ కాంప్లెక్స్‌లలో పొందిన శిక్షణను కేవలం కార్యక్రమానికే పరిమితం చేయకుండా తరగతి గదుల్లో ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు.

శిక్షణ ద్వారా తెలుసుకున్న నూతన బోధనా పద్ధతులను ఉపయోగించి విద్యార్థులకు మరింత సమర్థవంతంగా పాఠ్యాంశాలను బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

- వైద్య సేవలపై విద్యార్థులకు అవగాహన

- ఆసుపత్రిలో సేవల నిర్వహణను పరిశీలించిన విద్యార్థులు

- ఫీల్డ్ విజిట్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

నరసన్నపేట, సెప్టెంబరు 19 (వార్త): పోలాకి మండలం ఈదులవలస ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు శనివారం నరసన్నపేట ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ ఆదేశాల మేరకు విద్యార్థులకు వైద్య సేవలపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు ఈ ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆసుపత్రిలో అందుతున్న వివిధ వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు వైద్య సహాయం ఏ విధంగా అందిస్తున్నారు,

ఆసుపత్రిలో సిబ్బంది ఏయే విధులను నిర్వహిస్తున్నారు అనే అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల నిర్వహణ, రోగుల సంరక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు సిబ్బంది వివరించారు. పాఠ్యాంశాలకు అనుబంధంగా నిర్వహించిన ఈ ఫీల్డ్ విజిట్ ద్వారా ఆసుపత్రి నిర్వహణ, వైద్య సేవలపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన ఏర్పడింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21న మందసలో 'మజ్జి' వర్ధంతి కార్యక్రమాలు

మందస, సెప్టెంబరు 19(వార్త): మందస పట్టణంలోని ఈ నెల మజ్జి తులసీదాసు, మజ్జి నారాయణరావు, మజ్జి శారదమ్మ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా, మంత్రిగా, ఎంఎల్ఏగా స్వర్గీయ మజ్జి తులసీదాసు, ఎంఎల్ఏగా ఆర్టీసీ ఛైర్మన్ గా మజ్జి నారాయణరావు, ఎంఎల్సీగా మజ్జి శారదమ్మ ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. వీరి సేవలను గుర్తు చేసుకుంటూ.. మందస పట్టణంలోని జేకే కళ్యాణ మండపంలోని మధ్యాహ్నం రెండు గంటలకు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్వర్గీయ మజ్జి తులసీ దాసు, మజ్జి నారాయణరావు, మజ్జి శారదమ్మ వర్ధంతి కార్యక్రమాలను మజ్జి కుటుంబ అభిమానూలు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు విజయవంతం చేయాలని వారు కోరారు.

విద్యార్థి దశ నుంచే వస్తు వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలి

మెళియాపుట్టి, సెప్టెంబరు 19 (వార్త): విద్యార్థులు విద్యార్థి దశ నుండే వస్తు వినియోగం, నాణ్యత ప్రమాణాలు, ఐ ఎస్ ఐ మార్క్ తదితర వాటిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీ వి రమణమూర్తి అన్నారు. శనివారం నాడు మండలంలో గల కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ క్లబ్ సభ్యులు ఎల్. వి. చలం ఆధ్వర్యంలో ట్రెజర్ హంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తమ ఇళ్లలో, పరిసర దుకాణాల్లో లభించే వివిధ రకాల ఉత్పత్తులపై ఉన్న గుర్తులను సేకరించి పరిశీలించారు. వాటిలో ఐఎస్ఐ ముద్ర కలిగిన వస్తువులను గుర్తించి నివేదిక రూపంలో సమర్పించారు. విద్యార్థులకు ఈ అంశంపై నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విజేతలుగా ప్రకటించి బహుమతులు అందజేశారు. కుమ్మరి రోహిత్ ప్రథమ బహుమతి సాధించడంతో విద్యార్థికి 15వందలు రూపాయలు, ద్వితీయ బహుమతి సాధించిన బొండాడ ప్రమోద్ కి వెయ్యి రూపాయలు, తృతీయ బహుమతి సాధించిన పూజారి కుమారస్వామి కి 500 రూపాయలు, కన్సోలేషన్ బహుమతి బమ్మిడి చరిష్మా, విజేతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం స్టాండర్డ్ క్లబ్ మెంటర్ ఎల్. వి. చలం, ఉపాధ్యాయులు పి. రామారావు, ఎస్. దాసు, డి. దీనబంధు, పుష్పకుమారి, సింహాచలం, పుష్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం చెక్‌పోస్ట్ వద్ద 'అభయం' కార్యక్రమం

పాతపట్నం, సెప్టెంబరు 19 (వార్త) : ఆంధ్రా – ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని చెక్‌పోస్ట్ వద్ద శనివారం 'అభయం' కార్యక్రమాన్ని నిర్వహించారు. పాతపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె వెంకటరావు, ఎస్ఐ మధుసూదనరావులతో కలసి ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లలు మరియు ప్రయాణికుల భద్రతకై పోలీసు శాఖ చేపడుతున్న వివిధ రక్షణ చర్యలు, 'అభయం' యాప్ వినియోగం మరియు అత్యవసర సమయాల్లో పోలీసు సహాయం పొందే విధానాలపై స్థానికులకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. సరిహద్దు గుండా ప్రయాణించే వారు ఆందోళన చెందకుండా భద్రతా సూచనలు పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సిఐ వెంకటరావు సూచించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

వైసీపీ ఇచ్ఛాపురం రేసులో చాట్ల

- ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నట్టు పార్టీ పెద్దల ప్రకటన
- హర్షం వ్యక్తం చేసిన స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ తులసీదాస్ రెడ్డి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 19 (వార్త): సోంపేటలో జరిగిన వైస్సార్సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో రానున్న మున్సిపాలిటీ ఎన్నికలలో చైర్మన్ అభ్యర్థిత్వంపై పార్టీ పెద్దలు స్వర్ణ భారతి విద్యా సంస్థలు చైర్మన్ చాట్ల తులసీదాసు రెడ్డి పేరును పరిగణనలోకి తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాద రావు నలుగురు ఆశావహులు లో దాసు పేరు ను కూడా పరిశీలుస్తున్నట్లు చెప్పడం తో ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ప్రకటన సంతోషాన్ని కలిగించిందని , ఇచ్ఛాపురం మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయగలరని పార్టీ అధినాయకత్వ ఆశీస్సులు కోరుచున్నానని, పార్టీ పెద్దల పరిశీలనలో ఉన్న పేర్లలో ఏ ఒక్కరికైనా ఇచ్ఛాపురం మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిని ప్రకటించినా గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని ప్రకటించారు.

మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాలను, ఆలోచనలను ముందుకు తీసుకెళ్తూ, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, పార్టీ పెద్దల ఆదేశాలను పాటిస్తూ, పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని ఒక ప్రకటనలో తెలిపారు.

అభయాంజనేయ స్వామి ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం

- దాత ఉంగటి పాపారావు ఆర్థికసాయం
- కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్న దాత
- ట్రస్ట్ ఛైర్మన్‌కు విరాళం చెక్కు అందజేత

నరసన్నపేట, సెప్టెంబరు 19 (వార్త): నరసన్నపేట మండలం మడపాంలోని అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి దాత ఉంగటి పాపారావు రూ.లక్ష విరాళాన్ని అందించారు. శనివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులకు వినియోగించేందుకు రూ.లక్ష విలువైన చెక్కును ట్రస్ట్ ఛైర్మన్ తంగుడు జోగారావుకు అందజేశారు. ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని పాపారావు తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ట్రస్ట సభ్యులు పేర్కొన్నారు. దాతల సహకారంతో ఆలయంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఈశ్వరరావు, ట్రస్టీ రమణమూర్తి, పీఆర్వో సదాశివని కృష్ణ, ట్రస్ట్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వీఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

- వేతనాలు పెంచి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్
- 24 గంటలు విధులు నిర్వహిస్తున్నా కనికరం లేదని ఆవేదన
- ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక

నరసన్నపేట, సెప్టెంబరు 19 (వార్త): నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఎలు శనివారం ధర్నా నిర్వహించారు. దీర్ఘకాలంగా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పేర్కొంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. వీఆర్ఎలు గ్రామస్థాయిలో వివిధ రెవెన్యూ సంబంధిత విధులను నిర్వహిస్తూ నిరంతరం అందుబాటులో ఉంటున్నప్పటికీ తమ వేతనాల పెంపుపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవడం లేదని సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటలు విధుల్లో ఉంటున్న తమకు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సంఘ అధ్యక్షుడు మామిడి మల్లేశ్వరరావు, కార్యదర్శి బమ్మిడి సింహాచలం మాట్లాడుతూ వీఆర్ఎల వేతనాలను వెంటనే పెంచడంతో పాటు అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని సంఘ నాయకులు హెచ్చరించారు. తమ సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నరసన్నపేట మండల సమగ్ర అభివృద్ధికి కృషి

- ఐదేళ్లలో తాగునీరు, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం
- అధికారులు, ప్రజలకు ఎంపీపీ, జడ్పీటీసీ కృతజ్ఞతలు
- మరో నాలుగు రోజుల్లో ముగియనున్న పదవీకాలం

నరసన్నపేట, సెప్టెంబరు 19 (వార్త): నరసన్నపేట మండల పరిషత్ పరిధిలో గత ఐదేళ్లుగా సమగ్ర అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేశామని ఎంపీపీ అరంగి మురళీధర్, జడ్పీటీసీ అన్నపూర్ణ రామారావు తెలిపారు. శనివారం నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు తమ పదవీకాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చామని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా తాగునీటి సదుపాయాల మెరుగుదలతో పాటు రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేశామని చెప్పారు. తమ పదవీకాలం మరో నాలుగు రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో ఐదేళ్ల పాటు సహకరించిన ప్రజలకు, అభివృద్ధి పనుల్లో సహకరించిన అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది, మండల ప్రజలకు వారు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా రిటైర్డ్ హావల్దార్ అంతిమ సంస్కారాలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 19 (వార్త): స్థానిక ఫకీరు పేట కి చెందిన మాజీ హవల్దార్ దేవేంద్రబెహరా(85) గుండె పోటుతో శనివారం మృతి చెం దారు. విషయం తెలుసుకున్న తోటి మాజీ సైనికోద్యోగులు మృతిని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశ రక్షణ కోసం సైన్యంలో విధులు నిర్వహించిన దేవేంద్రబెహరా సేవలను ఈ సందర్భంగా తోటి మజీ సైనికోద్యోగ లు గుర్తు చేసుకున్నారు. అనంతరం బెహరా అంతిమ యాత్రను ప్రత్యేక రథంపై నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులు బంధువులు మాజీ సైనికోద్యోగులు స్థానికులుఅంతిమ యాత్రలో పాల్గొన్నారు. అంతిమ యాత్రను బాహుదానది వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి పార్థివ దేహంపై జాతీయ పతాకాన్ని కప్పి మాజీ సైనికులు సైనిక లాంఛనాలతో సెల్యూట్ చేసి గౌరవ వందనం సమర్పించారు. దేశ సేవలో చేసిన మాజీ సైనికుడికి గౌరవ ప్రదంగా వీడ్కోలు పలికారు. దేశ సేవలో అతను అందించిన సేవలను ఈ సందర్భంగా కొనాయాడారు. దేశ రక్షణ కోసం సైన్యంలో ఎంతో నిబద్ధతో వ్యహరించారని తెలిపారు. సైనిక సేవలో ఉన్న సమయంలో కష్టతరమైన పరిస్థితులను సైతం ఎదుర్కొని ధైర్యసాహసాలతో విదులు నిర్వహించారని పేర్కొన్నారు. దేశం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. చేశారు.

ఈసందర్భంగా మాజీ సైనికోద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగులు నారాయణ రావు ,రాజులురెడ్డి, డి విశ్వనాథంరెడ్డి, యు .శంకర్, జగన్నాథరెడ్డి, కురయ్య, వై వి రెడ్డి కదంబల కామరాజు చౌదరి తదితర సైనికోద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రిసోర్స్‌పర్సన్స్ శిక్షణ

- సబ్జెక్ట్ మెలుకువలు, నూతన బోధన విధానాలపై శిక్షణ
- సారవకోట, జలుమూరు మండలాల ఉపాధ్యాయులకు అవగాహన
- ఆధునిక విధానాలతో విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచన

సారవకోట, సెప్టెంబరు 19 (వార్త): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బోధనలో మరింత నైపుణ్యం పెంపొందించేందుకు రిసోర్స్ పర్సన్స్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం శనివారం సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. సారవకోట, జలుమూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన మెలుకువలు, బోధనా పద్ధతులు, నూతన విధానాలపై రిసోర్స్ పర్సన్స్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. తరగతి గదిలో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన చేపట్టే విధానాలపై వివరించారు. విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానంతో పాటు ఆసక్తి, సృజనాత్మకత పెంపొందేలా ఆధునిక బోధనా పద్ధతులను వినియోగించాలని ఎంఈవో రమణ సూచించారు. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని కోరారు. శిక్షణలో పొందిన అంశాలను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులను నూతన విధానాలతో తీర్చిదిద్దాలని సూచించారు.

టీటీడీ సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ..

ఇచ్ఛాపురం కళాకారులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 19 (వార్త): తిరుమల వెంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఇచ్ఛాపురానికి చెందిన వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ 20 మంది చిన్నారులకు వాహన సేవలో నాట్యం చేసే అద్భుత అవకాశం మరలా లభించింది ఈనెల 21. 22 తేదీలలో సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు వాహన సేవలో స్వామివారి ఎదురుగా ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు.నాట్య గురువులు నాట్యాచార్య ఏలేశ్వరపు శ్రీనివాసులు కూచిపూడి గ్రామం కృష్ణాజిల్లా వాస్తవ్యులు వీరి ఆధ్వర్యంలో వీరి శిష్య బృందం. కావ్య . జయలక్ష్మి. . పూజశ్రీ. శ్వేత. జాగృతి. జాహ్నవి దేవి. మధుశ్రీ. రమ్యశ్రీ. . సోనియా. పల్లవి . లిఖిత. . అక్షర. . కస్తూరి. . సంజన . దీక్సిత . పూజ.. పవిత్ర . శ్రీజణ్య. . శరణ్య శ్రీవల్లి ఎంపికైనారు ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ అక్టోబర్ నవంబర్ నెలల లో జరిగే ఈ మహోత్తర బ్రహ్మోత్సవాలకు సంవత్సరానికి మూడుసార్లు చక్కని అవకాశాన్ని అందిస్తున్న నాట్య గురువులు ఏలేశ్వరపు శ్రీనివాసులు కి. అకాడమీ వ్యవస్థాపకులు చిన్నా గురు స్వామి జయలక్ష్మి దంపతులు చిన్నారులు వీరి తల్లిదండ్రులు మాస్టర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లితండ్రులు కూడా పాల్గొంటున్నారు.

ప్రహారాజపాలెంలో వైద్య శిబిరం

పాతపట్నం, సెప్టెంబరు 19 (వార్త): గంగువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రహారాజపాలెం గ్రామంలో 'సేవా సంకల్ప్' కార్యక్రమంలో భాగంగా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ హిమశ్రీ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమశ్రీ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. శిబిరానికి వచ్చిన రోగులకు, గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి లింగుమూర్తి, ఏఎన్ఎం జి ఇందు కుమారి, కె.మాధవరావు, డిఈఓ టి స్వాతి, ఆశా వర్కర్లు డి స్వాతి, డివనిత, వైద్య సిబ్బంది,104 సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం సబ్ జైలును ఆకస్మిక తనిఖీ చేసిన న్యాయమూర్తులు

పాతపట్నం, సెప్టెంబరు 19 (వార్త): శ్రీకాకుళం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి వివేక్ ఆనంద్ శ్రీనివాసరావు, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కె హరిబాబు, పాతపట్నం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం రోషిణిలతో కలిసి పాతపట్నం సబ్ జైలును శనివారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా జైలులోని రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం రిమాండ్ ఖైదీల వివరాలు, వారి ఆరోగ్యం మరియు సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులోని బ్యారక్‌లు, వాష్‌రూమ్‌లు, వంటగది, మరియు స్టోర్ రూమ్‌లను స్వయంగా పరిశీలించి పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక లాయర్లను పెట్టుకోలేని ఖైదీలకు ప్రభుత్వం ఉచితంగా లీగల్ ఎయిడ్ (న్యాయవాది) సదుపాయాన్ని అందిస్తుందని, ఈ అవకాశాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ సన్యాసిరావు, జైలు విజిటింగ్ అడ్వకేట్ జి. ఫల్గుణరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో నానో ఎరువుల పిచికారీ

పాతపట్నం, సెప్టెంబరు 19 (వార్త): పాతపట్నం గ్రామంలో ఆత్మ కార్యక్రమం ఆధ్వర్యంలో శనివారం డ్రోన్ ద్వారా నానో యూరియా, నానో డిఏపి పిచికారీపై రైతులకు ప్రత్యక్ష అవగాహనా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె సింహాచలం, గ్రామ వ్యవసాయ సహాయకురాలు చాందిని మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం వల్ల సమయం, శ్రమ ఆదా అవుతాయన్నారు. డ్రోన్ల సహాయంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలపై సమానంగా ఎరువులను పిచికారీ చేయవచ్చని, కూలీల కొరత సమస్యను అధిగమించవచ్చని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక రైతులు పాల్గొని డ్రోన్ ద్వారా నానో ఎరువుల పిచికారీ విధానాన్ని ప్రత్యక్షంగా తిలకించారు.

భక్తిశ్రద్ధలతో వినాయకుని సామూహిక కుంకుమ పూజలు

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు

సోంపేట, సెప్టెంబరు 19(వార్త): కంచిలి మండలంలోని ఎస్ఆర్సీ పురం కాలనీలో నిర్వహిస్తున్న శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సామూహిక కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమానికి కాలనీ మహిళలతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు సామూహికంగా కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తిపూర్వక వాతావరణంలో పూజా కార్యక్రమం కొనసాగగా, మహిళలు స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు పలహారం పంపిణీ చేశారు. భక్తుల భాగస్వామ్యంతో సామూహిక కుంకుమ పూజ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

పోలీసుస్టేషన్ గడపలోనే ప్రమాదం!

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మెళియాపుట్టి, సెప్టెంబరు 19 (వార్త): పరిశుభ్రతతోనే ఆరోగ్యం పరిరక్షించుకోవచ్చునని ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ పండా అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వద్దు.. పేపర్ బ్యాగులు ముద్దు అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తోపాటు స్థానిక పిఎస్సి వైద్యాధికారి కె. ప్రశాంత్, ఎంఈఓ దేవేంద్రరావు, అధికారులు కూటమి పార్టీ నాయకులు, ఉపాధి హామీ, ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులున్నారు.

ఆధ్యాత్మిక పరిమళాల మధ్య
గణపతి నిమజ్జనం

పలాస, సెప్టెంబరు 19 (వార్త): సనాతన సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను ప్రతిబింబిస్తూ శ్రీ సత్యసాయి విద్యావిహార్, రామకృష్ణపురంలో గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ స్వచ్ఛమైన మట్టితో సంపూర్ణ పర్యావరణహితంగా తయారు చేసిన శ్రీ విద్యా గణపతి ప్రతిమకు ఐదు రోజులపాటు భక్తిశ్రద్ధలతో రెండుపూటలా పూజలు, భజనలు నిర్వహించారు.

నిమజ్జన కార్యక్రమం సందర్భంగా వేదఘోష, దివ్యనామ సంకీర్తనల నడుమ గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి ఘనంగా నిమజ్జనం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది.

ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతను కాపాడటంతోపాటు సనాతన ధర్మ విలువలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ భావన చిన్ననాటి నుంచే అలవాటుగా మారేలా విద్యార్థి దశలోనే పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడంలో శ్రీ సత్యసాయి విద్యావిహార్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు అనుదీప్, లావణ్యకృష్ణ, దాలేటి, వార్డెన్లు బలరాం, చంద్రశేఖర్, జీవన్, మౌనిక, అనిత, ఆశాతోపాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు
ఎల్ఐసీ చేయూత

- కవిటి అగ్రహారం జడ్పీహెచ్ పాఠశాలకు

వుడెన్ కబోర్డు వితరణ

పలాస, సెప్టెంబరు 19 (వార్త): ఎల్ఐసీ 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కవిటి అగ్రహారం గ్రామంలోని జడ్పీహెచ్ పాఠశాలకు పలాస ఎల్ఐసీ శాఖ ఆధ్వర్యంలో వుడెన్ కబోర్డును శనివారం అందజేశారు. విద్యార్థుల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్, సిబ్బంది, ఎల్ఐసీ చీఫ్ మేనేజర్ వి.రాజు, అసిస్టెంట్ మేనేజర్ నంబూరి నరేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ అధికారులు మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా విద్యాసంస్థలకు అవసరమైన సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల చదువుకు ఉపయోగపడే విధంగా పాఠశాలకు కబోర్డును అందజేసినట్లు తెలియజేశారు. భవిష్యత్తులోనూ అవసరాన్ని బట్టి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రతతో పాటు పొదుపు అవసరమని, వివిధ వర్గాల ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎల్ఐసీలో పలు రకాల బీమా, పొదుపు పథకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. బీమా రంగంలో ఎల్ఐసీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ గ్రామ ఏజెంట్ సోలా రజిని రాము, మెంటార్లు రుక్మధరావు, కృష్ణవేణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

-శిథిలావస్థకు చేరిన కాశీబుగ్గ స్టేషన్ ముఖద్వార గ్రిల్స్

-వాహనదారులకు మృత్యుపాశంగా మారిన ఇనుప చువ్వలు..

- మహిళా జర్నలిస్టుకు కాలు విరిగిన ఘటన

-వందలాది మంది రాకపోకలు

- పట్టించుకోని అధికారులు

పలాస, సెప్టెంబరు 19 (వార్త): ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసు స్టేషన్ ఆవరణలోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన గ్రిల్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో స్టేషన్‌కు వచ్చే వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. ఇనుప గ్రిల్స్ తుప్పుపట్టి బలహీనంగా మారడంతోపాటు.. మధ్య మధ్యలో సిమెంట్ బెర్మ్‌ల వద్ద ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ ఖాళీలు వాహన చక్రాలకు ఉచ్చులా మారుతున్నాయి.

మహిళా జర్నలిస్టుకు తీవ్ర గాయం

ఇటీవల కాశీబుగ్గ డీఎస్పీ నిర్వహించిన విలేకరుల సమావేశానికి కవరేజ్ కోసం వెళ్లిన మహిళా జర్నలిస్టు సీహెచ్ మేఘన వాహనం ఈ గ్రిల్స్ మధ్య చిక్కుకుని ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆమె ఎడమ కాలుకు తీవ్ర గాయమై ఎముక విరిగినట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి.

కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు ప్రతిరోజూ వివిధ సమస్యలపై వందలాది మంది ప్రజలు వస్తుంటారు. ఫిర్యాదుదారులు, బాధితులు, న్యాయ సహాయం కోసం వచ్చే వారు, వివిధ పనుల నిమిత్తం వచ్చే వాహనదారులు ఇదే ముఖద్వారం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి రద్దీ ప్రాంతంలో గ్రిల్స్ ప్రమాదకరంగా మారినా సంబంధిత అధికారులు ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భద్రత కల్పించాల్సిన చోటే ప్రమాదం ఎదురవుతుందని,

శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజలకు రక్షణ కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత. అలాంటి పోలీస్ స్టేషన్ ప్రవేశద్వారంలోనే ప్రమాదకర పరిస్థితులు నెలకొనడం విస్మయానికి గురిచేస్తోంది. చిన్నపాటి మరమ్మతులతో పరిష్కరించగల సమస్యను నిర్లక్ష్యం చేస్తే మరింత తీవ్రమైన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణ చర్యలు తీసుకోవాలని, గ్రిల్స్‌ను పూర్తిగా తొలగించి కొత్తవి ఏర్పాటు చేయడం లేదా ప్రమాదకరంగా మారిన భాగాలకు వెంటనే మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఇబ్బంది లేకుండా ప్రవేశద్వారాన్ని సురక్షితంగా మార్చాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఈ విషయంపై కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని ప్రత్యేకంగా దృష్టి సారించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ గడప దాటే ప్రతి ఒక్కరికీ భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సాంఘిక శాస్త్ర బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ

- విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాల బోధన

- విద్యార్థుల్లో సాంఘిక శాస్త్రంపై ఆసక్తి పెంచేందుకు సూచనలు

నరసన్నపేట, సెప్టెంబరు 19 (వార్త): సాంఘిక శాస్త్ర బోధనను మరింత ప్రభావవంతంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ అందించాల్సిన ఆవశ్యకత ఉందని మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) పేడాడ దాలినాయుడు తెలిపారు. నరసన్నపేట మండలం సత్యవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలోని అంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధనా విధానాలను అనుసరించాలని ఎంఈవో సూచించారు. కేవలం పాఠ్యపుస్తకంలోని అంశాలను వివరించడంతో కాకుండా, విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఉదాహరణలతో బోధించడం ద్వారా పాఠ్యాంశాలపై అవగాహన మరింత పెరుగుతుందని తెలిపారు. తరగతి గదిలో విద్యార్థులను చర్చల్లో భాగస్వాములను చేస్తూ, ఆసక్తిని కలిగించే విధంగా బోధనా పద్ధతులను రూపొందించాలని సూచించారు. బోధనలో కొత్త విధానాలను అనుసరించడం ద్వారా విద్యార్థుల్లో సాంఘిక శాస్త్రంపై ఆసక్తిని పెంచడంతో పాటు విషయ పరిజ్ఞానం మెరుగుపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు తమ బోధనా విధానాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలని ఎంఈవో సూచించారు. సమావేశంలో సాంఘిక శాస్త్ర బోధనకు సంబంధించిన పలు అంశాలపై చర్చించడంతో పాటు ఉపాధ్యాయుల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు

నరసన్నపేట, సెప్టెంబరు 19 (వార్త): పంచాయతీల పరిధిలో చేపడుతున్న పారిశుధ్య పనుల్లో ఎలాంటి

అలసత్వం వహించరాదని డిప్యూటీ ఎంపీడీవో, ఇన్‌చార్జి ఈవో పీ. జగన్మోహన్‌రావు సిబ్బందిని ఆదేశించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం నరసన్నపేట మేజర్ పంచాయతీలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారులు, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ కేవలం పంచాయతీ సిబ్బంది బాధ్యతగా కాకుండా ప్రజల భాగస్వామ్యంతోనే మరింత సమర్థంగా కొనసాగుతుందని జగన్మోహన్‌రావు పేర్కొన్నారు. రహదారులపై, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా స్థానికులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా నిర్వహించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లక్ష్యాలను సాధించేలా పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. పారిశుధ్య పనుల నిర్వహణలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రజల నుంచి వచ్చే సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు.

సొంత నిధులతో నీటి సమస్యకు పరిష్కారం

-రూ.30 వేలతో పైప్‌లైన్, ట్యాంకు ఏర్పాటు

- 36వ వార్డు హరిజన వీధి వాసులకు ఊరట

పలాస, సెప్టెంబరు 19 (వార్త): తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న 36వ వార్డు హరిజన వీధి వాసులకు కొంత ఊరట లభించింది. నీటి సరఫరాలో నెలకొన్న ఇబ్బందులను గుర్తించిన వార్డు టిడిపి ఇన్‌చార్జి కోరుకాన శంకర్రావు సుమారు రూ.30 వేల సొంత నిధులతో పైప్‌లైన్, నీటి ట్యాంకు ఏర్పాటు చేయించారు. దీంతో నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఏర్పడటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హరిజన వీధిలోని పలు కుటుంబాలకు క్రమబద్ధంగా తాగునీరు అందకపోవడంతో కొంతకాలంగా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సరఫరా సమయాల్లో తగినంత నీరు అందకపోవడం, వచ్చిన నీటిని నిల్వ చేసుకునే సదుపాయం లేకపోవడంతో సమస్య మరింత తీవ్రతరమవుతోంది. ఈ పరిస్థితిని గుర్తించిన వార్డు ఇన్‌చార్జి శంకర్రావు సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. సొంత ఖర్చుతో పనులు ప్రారంభించి, అధికారిక నిధులు, అనుమతుల కోసం ఎదురుచూడకుండా తక్షణ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని సొంతంగా నిధులు వెచ్చించి పైప్‌లైన్, ట్యాంకు ఏర్పాటు చేయించారు. సుమారు రూ.30 వేల వ్యయంతో చేపట్టిన పనులతో వీధిలో నీటి నిల్వకు అవకాశం ఏర్పడింది. అత్యవసర సమయంలో నీటిని వినియోగించుకునేందుకు ఈ ఏర్పాటు ఉపయోగపడుతుందని స్థానికులు తెలిపారు.

శాశ్వత పరిష్కారం చేపట్టేందుకు సొంత నిధులతో చేపట్టిన పనులు తాత్కాలికంగా ఉపశమనం కలిగించినప్పటికీ, వార్డులో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందని తెలిపారు. పైప్‌లైన్ నిర్వహణ, ట్యాంకు సంరక్షణతోపాటు క్రమబద్ధమైన నీటి సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ వీధిలోని కుటుంబాలకు నీటి సరఫరా సక్రమంగా లేక తరచూ ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించి తక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు అప్పటివరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా సొంత నిధులతో పైప్‌లైన్, ట్యాంకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా మున్సిపల్ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు.

రూ.96,000 పలికిన గణేష్ లడ్డు

కవిటి, సెప్టెంబరు 19 (వార్త): కవిటి మండలం డి. గొనప పుట్టుగ గ్రామంలో నిర్వహించిన గణేష్ పూజ మహోత్సవాల్లో శనివారం లడ్డు వేలంపాట నిర్వహించారు. 51 కిలోల లడ్డును 96,100 రూపాయలకు భక్తులు పాడుకున్నారు. ఈ లడ్డులో 10 కిలోలు పిన్నింటి అర్జునరావు, 5 కిలోలు బల్లెడ మోహన్ రావు, 36 కిలోలు ప్రతిభా యువజన సంఘం సొంతం చేసుకున్నారు. అలాగే రెండు కిలోల మరో లడ్డును భువనేశ్వర్ కు చెందిన పూర్ణచంద్ర, విజయలక్ష్మి దంపతులు 24 వేల వంద రూపాయలకు సొంతం చేసుకున్నారు. గణేష్ మండపంలో పూజలు అందుకున్న 100 గ్రాముల వెండి గణేష్ ప్రతిమను కవిటికి చెందిన బెండాళం నారాయణమూర్తి దంపతులు వేలంపాటలో సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

శబరిమలలో ఘనంగా అయ్యప్ప స్వామి మహామండల దీక్ష ప్రారంభం

- శబరిమల సన్నిధానంలో

ఇచ్ఛాపురం బృందం మాలాధారణ

-108 రోజుల కఠిన దీక్షా చరణం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 19 (వార్త): కలియుగ దైవం, సర్వరోగ నివారకుడు అయిన ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దీక్షా మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ ప్రారంభం అయ్యింది . శనివారం రోజున పుణ్యక్షేత్రమైన శబరిమల దివ్య సన్నిధానంలో మను నంబూత్రి మెల్ శాంతి చేతులు మీదుగా మాలధారణ ఇచ్ఛాపురంనకు చెందిన ప్రముఖ భక్త బృందం ఆధ్వర్యంలో మహా మండల దీక్ష చేపట్టారు . ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా సాగే ఈ పవిత్ర కార్యక్రమంలో భాగంగా ఆశీ క్రిష్ణ గురుస్వామి, సోడాయి .విమాల్ కుమార్ స్వామి బి .నరసింహ స్వామి, నేతృత్వంలో స్వాములు శబరిమల సన్నిధానంలో సాక్షాత్తు అయ్యప్ప స్వామిని పూజించే గురుస్వామి చేతుల మీదుగా పవిత్ర మాలాధారణ చేశారు. శబరిమలలో మాల ధరించిన అనంతరం, భక్తులు తమ స్వగ్రామమైన ఇచ్ఛాపురంకు చేరుకుని అక్కడ 108 రోజుల పాటు నియమ నిష్టలతో దీక్షను కొనసాగిస్తారు. దీక్షా కాలం పూర్తయిన తర్వాత, పవిత్ర మకరజ్యోతి దర్శనం పురస్కరించుకుని మళ్ళీ ఇరుముడి కట్టుకొని శబరిమల సన్నిధానానికి పయనం అవుతారు. అయ్యప్ప దీక్ష అనేది కేవలం మాల ధరించడం మాత్రమే కాదు, ఇంద్రియ నిగ్రహం, సత్యసంధత, భూశయనం (నేలపై నిద్రించడం), బ్రహ్మచర్యం పాటించడం మరియు సర్వభూతాల్లోనూ స్వామిని చూసే సమత్వ భావాన్ని పెంపొందించుకునే ఒక అత్యున్నత ఆధ్యాత్మిక సాధన. మండల కాలం పాటు నిత్య పూజలు, భజనలు, అయ్యప్ప స్వామి శరణు ఘోషతో ఇచ్ఛాపురం ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. ఈ పవిత్ర మహామండల దీక్షను చేపట్టనున్న ఆశీ క్రిష్ణ గురుస్వామి బృందానికి ఇచ్ఛాపురం పట్టణంలోని అయ్యప్ప భక్తులు, స్థానికులు ఘనంగా అభినందనలు తెలియజేస్తూ, స్వామివారి కృపతో ఈ దీక్ష దిగ్విజయంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546